# బలమైన పునాది

భక్త్‌సింగ్

ప్రథమ ముద్రణ : నవంబరు 1983 ప్రతులు 5000
నాల్గవ ముద్రణ : మార్చి 1990 ప్రతులు 2000
ఐదవ ముద్రణ : ఆగస్టు 1993 ప్రతులు 3000
ఆరవ ముద్రణ : ఆగస్టు 2001 ప్రతులు 3000

# "Strong Foundation"

పుస్తకములు కావలసిన వారు ఈ క్రింది అడ్రసుకు
వ్రాయ మనవి

**హెబ్రోను బుక్‌రూమ్**
గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్,
హైదరాబాద్ - 500 020.

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్.

# విషయ సూచిక


| | | పేజి |
|---|---|---|
| 1. | మారు మనస్సు | 4 |
| 2. | విశ్వాసము | 6 |
| 3. | బాప్తిస్మము | 9 |
| 4. | హస్తనిక్షేపణ | 14 |
| 5. | మృతుల పునరుత్థానము | 23 |
| 6. | నిత్యమైన తీర్పు | 24 |

# బలమైన పునాది

## పఠనము - హెబ్రీ 5:11-14; 6:1-3

"కాలమునుబట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసినవారై యుండగా, దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను" (హెబ్రీ 5:12). ఎంతో గొప్ప భారము కలిగి అపొస్తలుడు ఈ విషయమును హెబ్రీ విశ్వాసులకు వ్రాసెను. చాల సంవత్సరముల కొలది శక్తివంతమైన దేవుని వాక్యమును వినినప్పటికిని వారు ఆత్మీయముగా ఎదుగక యింకను శిశువులుగానే యుండిరి. వారు బలమైన ఆహారమును భుజించలేని బలహీనులుగానే యుండిరి. "పాలుత్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతి వాక్య విషయములో అనుభవములేనివాడై యున్నాడు. వయస్సు వచ్చినవారు అభ్యాసముచేత మేలు, కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు. గనుక బలమైన ఆహారము వారికే తగును" (హెబ్రీ 5:1-14).

ఈ దినములలో అనేకులు ఆత్మీయముగా శిశువులవలెనే యున్నారు. బైబిలు జ్ఞానమంతయు కలిగియున్నప్పటికిని వారు శిశువులుగానే ప్రవర్తించెదరు. దేవుని లోతైన విషయములను వారే మాత్రము గ్రహింపజాలరు. దేవుని గూర్చిన అనేక లోతైన మర్మములను పౌలు హెబ్రీయులతో పంచుకొన గోరెను. హెబ్రీయులకు వ్రాసిన పత్రికలోని ముఖ్యాంశము "గొప్పరక్షణ", "గొప్ప రక్షకుడు" - పరలోకపు ప్రధాన యాజకునిగా యేసుక్రీస్తు ప్రభువు యొక్క గొప్పతనమును, ఆయనద్వారా మనము పొందు గొప్పరక్షణను, బయలుపరచెను. హెబ్రీ విశ్వాసులు

ఆత్మీయముగా పసిపిల్లలుగానుండిరి. కిండర్ గార్టన్ (పసిపిల్లల) స్కూలులోని బాలురకు బోధించినట్లే పౌలు వారికి కూడ మూల పాఠములనే బోధించవలసి వచ్చెను.

వారు ఆత్మీయముగా శిశువులవలెనే ఉన్నారు. ఏల? ఎందుకనగా వారు రక్షణయొక్క మూల నియమములను గూర్చిన జ్ఞానమును స్పష్టముగా గ్రహించలేదు. "దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసివచ్చెను. మీరు పాలు త్రాగవలసినవారే కాని బలమైన ఆహారము తినగల వారు కారు". కనుక రక్షణయొక్క మూలోపదేశములను గ్రహించితేనే తప్ప ఆత్మీయముగా ఎదుగజాలము. బలమైన పునాదిలేని ఏ కట్టడమును చాల కాలము నిలువదు. బలమైన పునాదులు లేనందున తుఫానులు వచ్చినప్పుడు అనేక కట్టడములు కూలిపోవును. మనము ఈ లోకములో అనేక తుఫానులను ఎదుర్కొన వలెనని దేవుడు తన వాక్యముద్వారా మనలను హెచ్చరించెను. మత్తయి 7:27లో ఇసుకమీద కట్టబడిన యింటికి సంభవించినదానిని చూడగలము. మన జీవితము కూడ బలమైన పునాదిమీద కట్టబడక పోయినట్లయితే ఆ యింటికి సంభవించినదే మనకును జరుగును. విశ్వాసులలో అనేకులు కష్టములు, శ్రమలు, పరీక్షలు రాగానే విశ్వాసమును కోల్పోయెదరు, అభ్యంతరపడి తప్పు సిద్ధాంతములవైపు ఆకర్షింపబడెదరు. మనజీవిత కాలములో అనేక తుఫానులను ఎదుర్కొనవలయును. కనుకనే మన జీవితము బలమైన పునాదిమీద కట్టబడుట ఎంతో అవసరము.

ప్రథమముగా మన పునాది యేసుక్రీస్తు ప్రభువై యుండవలెను. ఆయన మీదనే మనజీవితము కట్టబడవలెను. "మేము దేవుని జతపని వారమైయున్నాము. మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునై

యున్నారు. దేవుడు నా కనుగ్రహించిన కృపచొప్పున నేను నేర్పరియైన శిల్పకారునివలె పునాది వేసితిని మరియొకడు దానిమీద కట్టుచున్నాడు. ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగా చూచుకొనవలెను. వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు" (1 కొరింథీ. 3:9-11). సజీవుడైన యేసుక్రీస్తు ప్రభువుతో మనకు వ్యక్తిగత అనుభవముండినట్లు నిశ్చయముగా ఎరుగవలెను. ఆయనతో వ్యక్తిగత సంబంధము కలిగి, రక్షింపబడిన పిమ్మట అపొస్తలులు ప్రవక్తలు వేసిన పునాదిమీద మన జీవితము కట్టబడునట్లు జాగ్రత్తగా చూచుకొనవలయును. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా, అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయ మగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మ మూలముగా దేవునికి నివాస స్థలమై యుండుటకు కట్టబడుచున్నారు. అపొస్తలులు, ప్రవక్తలు లేఖనముల ద్వారా దేనిని బోధించిరో దానినే వెంబడించెదము. అదియే పరలోకపు క్రమము. ఆ దైవక్రమమును, పరలోకపు క్రమమును మనము మార్చజాలము. మన ఆత్మీయ ఎదుగుదల కొరకు అవసరమైన ఉపదేశములు ఎంతో స్పష్టముగా యివ్వబడినవి. ఈ పునాదిమీదకు మనమెట్లు రాగలమో పౌలు హెబ్రీ పత్రికలో తెలియజేయుచున్నాడు. పరిపూర్ణులమగుటకు సాగిపోవలయుననినచో, ముందుగా ముఖ్యమైన రక్షణ నియమములను పాటించవలయును. "కాబట్టి నిర్జీవ క్రియలను విడిచి మారు మనస్సు పొందుటయు దేవునియందలి విశ్వాసమును, బాప్తిస్మములను గూర్చిన బోధయు, హస్త నిక్షేపణమును, మృతుల పున రుత్థానమును, నిత్యమైన తీర్పును అను పునాది మరల వేయక క్రీస్తును గూర్చిన మూలోపదేశము మాని సంపూర్ణులమగుటకు సాగిపోదము" (హెబ్రీ 6:1).

రక్షణ సిద్ధాంతములో మూలమైన ప్రధమమైన ఆరు నియమములను గూర్చి అపొస్తలుడు చెప్పుచున్నాడు. అందులో మొదటిది మారుమనస్సు: నిర్జీవ క్రియలను విడచి మారుమనస్సు పొందుట. రెండవది దేవునియెడల విశ్వాసము, మూడవది బాప్తిస్మము, నాల్గవది హస్త నిక్షేపణ, ఐదవది మృతుల పునరుత్థానము. ఆరవది నిత్యమైన తీర్పు. ఈ ఆరింటిలో ప్రతి రెండింటిని కలిపి మూడు గుంపులుగా చేయవచ్చును. ఆ రెండును కలిసియుండును. (1) మారుమనస్సు - విశ్వాసము (2) బాప్తిస్మము - హస్త నిక్షేపణ (3) మృతుల పునరుత్థానము- నిత్యమైన తీర్పు.

* * *

# I. మారు మనస్సు

మారుమనస్సు అనగా ఏమి? సత్క్రియలద్వారా ఎన్నటికిని నీతిమంతులము కాలేమని మొట్టమొదటిగా గుర్తించవలయును. స్వంత ప్రయత్నములద్వారా ఎవరును నీతిమంతులు కాలేరు. ఎంత కష్టపడినను నీతిమంతులు కాలేరు. అది క్రియలద్వారా కలుగదు. విశ్వాసముద్వారానే కలుగును. "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీవలన కలిగినది కాదు దేవుని వరమే" (ఎఫెసీ 2:8). దీర్ఘ ప్రార్థనల ద్వారా కాని, ఉపవాసముద్వారా కాని, బైబిలు జ్ఞానముద్వారా కాని మరి ఏ క్రియద్వారాను నీతిమంతులము కాలేము. ఈ విషయమును జ్ఞాపకముంచుకొనవలెను. నిరాడంబరముగా జీవించుటద్వారా నీతిమంతులు కాగలరని అనేకులు భావించెదరు. బల్లలో పాలు

పొందుటద్వారా నీతిమంతులు కాగలరని తలంచెదరు. ఎట్టి క్రియలద్వారానైనను నీతిమంతులు కాలేరు. సజీవుడైన యేసు క్రీస్తు ప్రభువే మన నీతి. "ఆయన మూలముగా మీరు క్రీస్తు యేసు నందున్నారు. ఆయన మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనము నాయెను" (1 కొరింథీ 1:30, 31). ఆయనే మన పాపములకొరకై సంపూర్ణ క్రయమును చెల్లించెను. యూదా జనాంగము వారి స్వనీతినిబట్టియు, ఉన్నతమైన నైతిక స్థానమునుబట్టియు ఆత్మీయముగా అంధులై యున్నారు. "పనిచేయక భక్తిహీనుని నీతిమంతునిగా తీర్చువానియందు విశ్వాసముంచు వానికి వాని విశ్వాసము నీతిగా ఎంచబడుచున్నది" (రోమా 4:5). ఈ విషయమును చాల స్పష్టముగా గ్రహించవలయును. యేసుక్రీస్తు సజీవుడైన దేవుడు. మనము బల్లలో పాలు పొందునప్పుడు ప్రభువే మన ఆహారమనియు, మన జీవమనియు, సాక్ష్యమిచ్చుచున్నాము. ఆయననే నీతిగా ఎడతెగక మనము అన్వయించుకొనవలెను. విశ్వాసము ద్వారా ఆయన జీవమును పొందుట వలననే నీతిమంతులము కాగలము. లేనట్లయినచో, మనము కష్టపడి, పరిశుద్ధులము కావలయునని పోరాడి, పోరాడి, మరల, మరల పడిపోయెదము. అందువలననే అనేకులు శిక్షావిధిలోనే యున్నారు. నీతిమంతులు కావలెనని ఎంతో ప్రయాసపడెదరు. కాని వారి ప్రయాసమంతయు వ్యర్థము. నీతిమంతులమగుటకు మనము చేయు ప్రయత్నములన్నియు నిర్జీవ క్రియలై యున్నవి. కనుకనే ఆ నిర్జీవ క్రియల విషయమై మారు మనస్సు పొందవలెను. మొదటిదిగా నీతిమంతుల మగుటను మారుమనస్సు అని పౌలు చెప్పుచున్నాడు. యేసుక్రీస్తు ప్రభువే మన స్థానము వహించి మన పాపము భరించి, మన దోషమునకు రావలసిన శిక్షను తానేపొంది, మన తీర్పును తాను భరించెనని హృదయ పూర్వకముగా విశ్వసించవలయును. విశ్వాసము ద్వారా ఆయన జీవమును

అధికముగా పొందవలయును. ఓడిపోయినప్పుడెల్లను మనమిట్లు చెప్పవలెను: ప్రభువా, నాయందు నేను అతిశయించుటలేదు. నీవే నా నీతి, నా జీవమునై ఉన్నావు". రక్షణలోని మొట్టమొదటి ముఖ్యమైన మూల నియమమే మారుమనస్సు.

* * *

# 2. విశ్వాసము

రెండవ మూల నియమము విశ్వాసము, దేవునియందు విశ్వాసముంచవలెను. ప్రతిదానికి విశ్వాసము అవసరము. ప్రార్థనకు విశ్వాసము అవసరము. ఆయన జీవమును పొందుటకు విశ్వాసము అవసరము. విశ్వాసము లేకుండ మనమేమి చేసినను దానిలో ఓడిపోవుట తథ్యము. అనేక సందర్భములలో ప్రభువు "నీ విశ్వాసము నిన్ను రక్షించెను" అని వ్యాధిగ్రస్తులతో చెప్పెను (లూకా 7:50; 8:48; 17:19; 18:42). మత్తయి 9:2లో పక్షవాయువుతో మంచము పట్టియున్న ఒకనిని జనులు ఆయన యొద్దకు తీసికొని వచ్చినప్పుడు ఆయన, వారి విశ్వాసముచూచి అతనిని స్వస్థపరచెను. అదృశ్యమైన వాటిని విశ్వాసము ద్వారానే సృష్టించగలము. "విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజ స్వరూపమును అదృశ్యమైనవి ఉన్నవనుటకు ఋజువునై యున్నది" (హెబ్రీ 11:1). అదృశ్యమైన, నిజమైనవాటిని కళ్ళతో చూచి గ్రహించుట అసాధ్యము. అవి పరలోకపు మర్మములు, అదృశ్యమైనవి. అయితే విశ్వాసము ద్వారానే వాటిని మనము గ్రహించగలము. విశ్వాసము ద్వారానే ప్రార్థనలకు

జవాబులు వచ్చును. విశ్వాసము ద్వారానే ప్రభువు శక్తి అనుభవించెదము. ప్రార్థనా జీవితమునకైనను, బైబిలు పఠనమునకైనను మరి వివిధమైన పరిచర్యలకైనను మూలమైనది విశ్వాసమే. విశ్వాసము ద్వారానే ప్రభువుకు విధేయులము కాగలము. విశ్వాసము ద్వారానే ప్రభువును వెంబడించ గలము. "సుంకపు మెట్టునొద్ద కూర్చుండియున్న మత్తయి అను ఒక మనుష్యుని చూచి నన్ను వెంబడించుమని చెప్పగా అతడులేచి ఆయనను వెంబడించెను" (మత్తయి 9:9). విశ్వాసము ద్వారానే మత్తయి వెంటనే ప్రభువుకు లోబడి ప్రభువును వెంబడించెను. నన్ను కూడ ప్రభువు సేవకు పిలిచినప్పుడు ఎన్నో అయోగ్యతలు కలిగిన నేను ఆయనను ఎట్లు సేవించగలనో నాకు అర్థము కాలేదు. నేను నత్తివాడనైనప్పటికిని ఆయన సహాయము చేయగలడని విశ్వసించితిని. బహిరంగముగా పరిచర్య ప్రారంభించినప్పుడు ఎంతో ప్రార్థించితిని. అప్పుడు మత్తయి 10:20 నుండి ప్రభువు నాకొక వాగ్దానము నిచ్చెను. "మీ తండ్రి ఆత్మ మీలో ఉండి మాటలాడుచున్నాడేగాని మాటలాడువారు మీరు కాదు". నేను ఈ వాగ్దానమును నమ్మితిని. ఒక రోజు దాదాపు 700 మంది ప్రజల యెదుట నేను నిలువబడి ప్రసంగించవలసివచ్చెను. వారి ముఖములు చూడగానే నాకు భయముకలిగి వణకుచుంటిని, నాచేతిలోనున్న బైబిలు కదలుచుండెను. అప్పుడు నేను, "ప్రభువా నాకు సహాయము చేయుము. నా పెదవులు ముట్టుము. నా గొంతును ముట్టుము" అని ప్రార్థించితిని. నేను ఏమి మాట్లాడనై యున్నానో నాకు తెలియదు. కాని ప్రభువు నన్ను ముట్టుటద్వారా నాకు కొన్ని అధ్యాయములు, కొన్ని వాక్యములు జ్ఞాపకమునకు వచ్చెను. నేను పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వవిద్యాలయములకు వెళ్ళవలసివచ్చెను. మురికి స్థలములలో నివసించేవారియొద్దకు కూడ వెళ్ళేడివాడను. ఆ స్థలములకు వెళ్ళినప్పుడు

నాకు చాల భయము కలిగెడిది. ఎందుకనగా వారు నావైపు కూడ చూచెడివారు కాదు. పైగా నన్ను చూచి హేళనచేసెడివారు. ప్రభువా నన్ను కనికరించి నాకు సహాయము చేయుమని ప్రార్థించెడివాడను. నా అయోగ్యతను, కొరతను ఎరిగియుంటిని. కనుకనే ప్రతి పర్యాయము విశ్వాసముతో ప్రభువుకు మొఱ్ఱ పెట్టెడివాడను. ఆ రీతిగా ప్రభువు నాకు సహాయపడెను.

మనము విశ్వాసము ద్వారానే ఆత్మీయ జీవితమును జీవించగలము. విశ్వాసము ద్వారానే శత్రువును బంధించగలము. విశ్వాసము ద్వారానే దేవుని వాగ్దానములను చేపట్టగలము. విశ్వాసము ద్వారానే నిత్య జీవమును పొందగలము. అందువలననే మారుమనస్సు, విశ్వాసము అను రెండును ఒకటిగా నుండును. విశ్వాసము లేనివారు ఆత్మీయముగా ఎదుగలేరు. మహాసభలు జరిగించినను, దండయాత్రలకు వెళ్ళినను వారికి విశ్వాసముండదు. వారి ఖర్చులకు కావలసిన డబ్బును అడుక్కొనెదరు. అక్కడనే వారు తప్పిపోవుచున్నారు. ఎన్నో రకములైన తంత్రములు, ఎత్తుగడలద్వారా డబ్బు సంపాదించుకొనెదరు. సువార్త దండయాత్రకు వెళ్ళవలయునని తలంచినప్పుడు ఎంతో మందికి ఉత్తరములు వ్రాసి వారికి డబ్బు అవసరమని సూచించెదరు. అది విశ్వాసము కాదు. ప్రభువునందు బలమైన, సజీవమైన విశ్వాసము కలిగియున్నప్పుడే ఆయన శాంతిని పరిపూర్ణముగా అనుభవించెదము. అప్పుడే మన అక్కరలన్నియు ఆయన ద్వారా తీర్చబడును.

* * *

# 3. బాప్తిస్మము

రక్షణయొక్క మూల సూత్రములలో మూడవది బాప్తిస్మము (హెబ్రీ 6:2). బాప్తిస్మము యొక్క అవసరతను, ప్రాముఖ్యతను అనేకులు ఎరుగరు. ఉదాహరణగా మన శరీరములో ఏవైనా పోషక పదార్థములు లోపించినట్లయినచో మనకు అనారోగ్యము కలుగును. దక్షిణ ఇండియాలో చాలామంది ప్రజలు వేసవికాలములో కొండ ప్రాంతమునకు వెళ్ళెదరు. అక్కడ వాతావరణము మనోహరముగా నుండును. కొన్ని సంవత్సరముల క్రిందట అక్కడి ప్రజలకు చర్మవ్యాధి వచ్చుచున్నదని తెలిసికొనిరి. మంచి వాతావరణము, మంచి భోజనము కలిగియున్నను, ఆ ప్రజలకు ఈ వ్యాధి ఏల కలిగెనో అర్థము కాలేదు. కొన్ని పరిశోధనలు జరిగించిన తరువాత అక్కడ నీటిలో సున్నము లేదని తెలిసికొనిరి. త్రాగేనీటిలో సున్నము కలిపిన తరువాత, వారికి స్వస్థత కలిగెను. ఆ రీతిగా ఆహారములో విటమినులు లోపించినప్పుడు అనారోగ్యము కలుగునని మనకు తెలియును. అదేరీతిగా బాప్తిస్మములో సాక్ష్యము యివ్వనియెడల ఆత్మీయముగా ఎదుగజాలము. రక్షణయొక్క మూల సిద్ధాంతములలో బాప్తిస్మము కూడ యితర సిద్ధాంతమువలె ముఖ్యమైనది. విశ్వాసులను గ్రుడ్డివారిగా నుంచుటకై శత్రువు ఎన్నో పన్నాగములు పన్నును. కొంతమంది విశ్వాసులు బాప్తిస్మము అవసరము లేదు, క్రొత్త జన్మ చాలునని చెప్పెదరు. నామకార్థ క్రైస్తవులు, బాప్తిస్మమును ఒక ఆచారముగా పాటించెదరు. అయితే విశ్వాసులకు బాప్తిస్మమనునది ఒక సాక్ష్యముగానున్నది. బాప్తిస్మముద్వారానే మనము ప్రభువు యొక్క మరణ, భూస్థాపన, పునరుత్థానములలో ఐక్యపరచ బడుచున్నాము. ఆయనతో మనకుగల ఐక్యతను బాప్తిస్మముద్వారా వెల్లడి చేయగలము.

నేను తిరిగి జన్మించిన తరువాత రెండు సంవత్సరముల వరకు బాప్తిస్మమును గురించి తలంచలేదు. ప్రతిదినము బైబిలు చదువుచుంటిని. కొన్నిసార్లు దినమంతయు బైబిలు చదువుచునే సమయము గడిపెడివాడను. అయినను బాప్తిస్మము అవసరము లేదని తలంచి బాప్తిస్మములో సాక్ష్యమివ్వకుంటిని. 1932వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో ఒక దినము నా మౌన ధ్యాన సమయములో ప్రభువు మత్తయి 3:13 ద్వారా నాతో మాట్లాడెను. "ఆ సమయమున యోహానుచేత బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయనుండి యొర్దాను దగ్గరనున్న అతనియొద్దకు వచ్చెను". అప్పుడు ప్రభువు నాతో ఈ రీతిగా మాట్లాడెను. "నీవు నీ రక్షకునికంటె ఏ విషయములోనైనను అధికుడవా?" అందుకు నేను, "ప్రభువా లేదు, ఎన్నటికిని అట్లుకాదు" అని చెప్పితిని. 'అయితే బాప్తిస్మము విషయమేమి?' అని ప్రభువు నన్ను ప్రశ్నించెను. నేనప్పటివరకు బాప్తిస్మము అవసరము లేదు కదా: నేను క్రొత్తగా జన్మించితిని. అనేక స్థలములలో ప్రభువును గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను. అది చాలునని తలంచితిని. అయితే ప్రభువుకు బాప్తిస్మము తీసికొనుట అవసరము లేకపోయినప్పటికిని నా కొరకై ఆయన బాప్తిస్మము తీసికొనెనని నేను గ్రహించితిని. మరునాడే నేను బాప్తిస్మము తీసికొంటిని. ఆ దినమున నేను కూటమును జరిగించితిని. ఆ కూటములోనే నేను బాప్తిస్మమును తీసికొంటిని. నేను నీళ్ళలోనుండి బయటకు రాగానే ఎంతో గొప్ప సంతోషము నాకు కలిగెను. ఆ దినము నుండి బైబిలు నాకు నూతన గ్రంథమాయెను. సమస్తమును క్రొత్తవాయెను. బైబిలులో బాప్తిస్మమును గూర్చి సువార్తలలోను, పత్రికలలోను 51 సార్లు చెప్పబడినట్లు నేను గుర్తించితిని. వాటినన్నిటిని నేను చదివితిని.

హెబ్రీ 6:2లో బాప్తిస్మములను గూర్చిన బోధ అని వ్రాయబడెను. బాప్తిస్మములు అని ఏల వ్రాయబడెను? మనము తిరిగి జన్మించిన తరువాత పరిశుద్ధాత్మద్వారా ఒకే శరీరములోనికి బాప్తిస్మము పొందితిమి. ఇది మొదటి బాప్తిస్మము. "ఏలయనగా, యూదులమైనను, హెల్లేనీయుల మైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరముగా ఉండుటకు ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1కొరింథీ 12:13). రెండవ బాప్తిస్మము నీటి బాప్తిస్మము, సంపూర్ణతకొరకై బాప్తిస్మము అను పదము బైబిలులో వాడబడలేదు. బాప్తిస్మము అనగా మునుగుట లేక స్నానముచేయుట. మనము స్నానము చేసినప్పుడు మన శరీరమంతటిని కడుగుకొనెదము. కాళ్ళు, చేతులు మాత్రమే కడుగుకొనినట్లయినచో అది స్నానముగా నెంచబడదు. అదేరీతిగా బాప్తిస్మము తీసికొనుటద్వారా యేసుక్రీస్తు ప్రభువు నా పాపములన్నింటి నుండి నన్ను కడిగియున్నాడని సాక్ష్యమిచ్చెదము.

రెండవదిగా, బాప్తిస్మముద్వారా ప్రభువుయొక్క మరణ, భూస్థాపన, పునరుత్థానములలో ఐక్యపరచుకొనెదము. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి ఏలాగు లేపబడెనో, అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి "(రోమా 6:3-5). మనము యింతకుముందు చూచిన రీతిగా రక్షింపబడినప్పుడు యేసుక్రీస్తు ప్రభువుయొక్క శరీరములోనికి చేర్చబడితిమి. ఆయన శరీరములో అవయవములమైతిమి. కనుక ఆయన జీవము మనలోనుండి ప్రవహించుచుండును. బాప్తిస్మముద్వారా ప్రభువుతో మనకుగల ఆత్మీయ

ఐక్యతను వెల్లడి చేసెదము. ఆయన మన సృష్టికర్త. ఆయన తన జీవమును మన కనుగ్రహించెను. అనగా మన జీవము ఆయన యందున్నది."ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను" (యోహాను 1:4). కనుకనే ఆయన మరణించినప్పుడు మనమును మరణించితిమి. ఆయన పాతిపెట్టబడినప్పుడు మనమును పాతిపెట్టబడితిమి. ఆయన పునరుత్థానుడైనప్పుడు మనమును పునరుత్థానులమైతిమి.

ప్రభువుతో మనకుగల సంబంధమును ఒక స్త్రీ గర్భములోనున్న శిశువుతో పోల్చవచ్చును. ఒకవేళ ఆ గర్భిణి స్త్రీ మరణించినట్లయినచో, ఆమె గర్భములోని శిశువుకూడ మరణించును. ఆమె పాతిపెట్టబడినయెడల ఆ శిశువుకూడ ఆమెతో పాటు పాతిపెట్టబడును. ఏదైన ఒక అద్భుతము జరిగి ఆ గర్భిణి స్త్రీ తిరిగి బ్రతికినట్లయినచో, ఆ శిశువుకూడ బ్రతుకును. మన జీవము కూడ ప్రభువునందున్నది. అందువలననే ఆయన మరణ, భూస్థాపన, పునరుత్థానములలో ఐక్యపరచబడియున్నాము. ప్రభువుతో మనకుగల ఐక్యతను బయలుపరచుటయే బాప్తిస్మము.

ప్రభువుతో మనకుగల ఆత్మీయ ఐక్యతను విశ్వాసము ద్వారానే అనుభవించగలము. ఆయన ఎన్నో సంవత్సరముల క్రిందట మరణించెను. అయినను ఈనాటి వరకు ఆయన మరణము ద్వారా పొందిన మేలును అనుభవించుచున్నాము. మరణపు శక్తి ద్వారా మన పాత స్వభావమునకు మరణించెదము. మన స్వంత చిత్త శక్తి ద్వారా మనము మరణించలేము. కోపము, ఈర్ష్య, గర్వము, ద్వేషము అను బలహీనతల కొరకై మనము "యేసు ప్రభువా ఈ బలహీనతలన్నియు నాలోనున్నవి. నా సందేహములు, భయములు నాలోనుండి తొలగించుము. నా తలంపులకు, కోరికలకు,

వాంఛలకు, నా ఏర్పాటులకు, బలహీనతలకు నీ మరణపు శక్తిద్వారా చనిపోవలెనని కోరుచున్నాను. అదే రీతిగా నీ భూస్థాపన శక్తిద్వారా నా కోరికలు, బలహీనతలు సమాధి చేయవలెనని కోరుచున్నాను. అదే విశ్వాసము ద్వారా నీ పునరుత్థాన శక్తిని పొందవలెనని కోరుచున్నాను" అని ప్రార్థించవలయును. ఆ రీతిగా ఆయన మరణ, భూస్థాపన, పునరుత్థాన శక్తిని అన్వయించుకొనవలెను. ఆయన మరణమునకు శాశ్వతమైన విలువగలదు. ఆయన మాటలు నిత్యమైనవి. ఆయన క్రియలు కూడ నిత్యమైనవి. ఆయన నిత్యుడగు తండ్రి గనుక ప్రభువుకంటె ముందుగా చనిపోయినవారికిని, ఆయన తరువాత చనిపోయిన వారికిని, అందరికి ఆయన మరణముద్వారా మేలు కలుగుచున్నది.

అనుదినము విశ్వాసము ద్వారా ప్రభువుయొక్క మరణపు శక్తివలన మన తలంపులకు చనిపోవలయును. భూస్థాపనశక్తి ద్వారా వాటిని మరచిపోవలెను. పునరుత్థానశక్తి ద్వారా పాపము మీద, శోధనమీద జయమును పొందవలయును. ఈ మూడు రకముల ఐక్యతను అనుభవించవలయును. బాప్తిస్మము ఒక సంప్రదాయము కాదు. కాని సాక్ష్యముగా నున్నది, బాప్తిస్మములో సాక్ష్యమివ్వనివారు వారి జీవితములో ఓడిపోయెదరు. ప్రభువుతో ఐక్యపరచబడుట ద్వారానే మనము జయమును పొందెదము. నీటి బాప్తిస్మము ద్వారా ప్రభువుతో ఆత్మీయముగా ఐక్యపరచబడియున్నామని తెలియచేసెదము. క్రీస్తు ప్రభువుయొక్క సంపూర్ణతలో మన పాలును అనుభవించుటకు బాప్తిస్మము సహాయ పడును. అందువలననే మూలసిద్ధాంతములలో బాప్తిస్మము ఒకటిగా నున్నది.

* * *

# 4. హస్త నిక్షేపణ

మూల సిద్ధాంతములలోని నాల్గవది హస్త నిక్షేపణ (హెబ్రీ 6:2). బైబిలులో హస్త నిక్షేపణ అనేకమైన వాటిని సూచించుచున్నది. సంబంధము, ఏకత్వము, సమానత్వమును హస్త నిక్షేపణ సూచించుచున్నది. మొట్టమొదటిసారిగా బైబిలులో హస్త నిక్షేపణను గూర్చి అదికాం. 48:14లో చూచెదము. "మనష్షే పెద్దవాడైనందున ఇశ్రాయేలు తన చేతులను యుక్తిగా చాచి చిన్నవాడైన ఎఫ్రాయిము తలమీద తన కుడిచేతిని, మనష్షే తలమీద తన ఎడమచేతిని ఉంచెను". యాకోబు తన మనుమళ్ళ తలల మీద చేతులుంచి వారిని దీవించెను. యోసేపు ఐగుప్తులో గొప్పవాడాయెను. ఫరో తరువాత అధికారిగా నుండెను. అయినను తన కుమారులను తన తండ్రియొద్దకు తెచ్చి ఆయన తన కుమారులను దీవించవలయునని కోరెను. లోక సంబంధమైన దీవెనకొరకై వారిని తీసికొని రాలేదు. లోకరీతిగా చూచిన యోసేపు యాకోబుకంటె ఎంతో గొప్పవాడు. అబ్రాహామును దేవుడు ఏడంతలుగా ఆశీర్వదించెను (అదికాం. 12:2-3). అబ్రాహామున కును, అతని సంతానమునకును యిచ్చిన ఆశీర్వాదములు తన కుమారులు కూడ పొందవలయునని కోరి వారిని తన తండ్రియొద్దకు తెచ్చెను.

చాలామంది విశ్వాసులు లోకస్థుల ద్వారా మోసపోయెదరు. లోక సంబంధమైన మార్గములలో నడచెదరు. దేవుని విషయములకంటె పిక్నిక్‌లు, పార్టీలు, డిన్నర్లు అనినవారికి చాల యిష్టము. కనుకనే వారు ఆత్మీయముగా ఎదుగలేకున్నారు. విశ్వాసులముగా లోకస్థులతో ఎటువంటి

సంబంధము కలిగియుండకూడదు. లోకసంబంధమైన కార్యక్రమములలో ఎటువంటి పాలు పొందకూడదు. వారియెడల దయచూపవలెను, మర్యాదగా ప్రవర్తించవలెను. అంతేకాని వారితో సహవాసము చేయకూడదు. ప్రభువు బిడ్డలతోనే మనము సహవాసము చేయవలెను. వారు పేదవారైనను లేక విద్యా విహీనులైనను వారితోనే సహవాసము చేయవలెను. ఎందుకనగా వారు దేవుని ప్రజలు. వారే మనవారు. కనుక బాప్తిస్మము తరువాత చేతులుంచుట వలన మనము దేవుని బిడ్డలతో సమానముగా ఎంచుకొనుచున్నామని తెలియజేసెదము.

నా జీవితములో ఒక సంఘటన నాకు బాగుగా జ్ఞాపకమున్నది. నేను కళాశాలలో చదువుకొనే దినములలో నాకొక మంచి స్నేహితుడుండెను. నేను కెనడా నుండి ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత అతనిని చూడ గోరి అతని దగ్గరకు వెళ్ళితిని. అతడు అప్పటికి ధనవంతుడుగా నుండెను. తనతో కొన్ని దినములు గడుపవలెనని అతడు నన్ను కోరెను. నన్ను ఎంతో దయతో పరామర్శించెను. నేను అతని యింటిలో సౌఖ్యముగా నుండునట్లు చేసెను. అయినను ఆ యింటిలో నేనొక పరాయి వ్యక్తివలెనే యుంటిని. అతనితో కలిసి ప్రార్థించలేక పోతిని. దేవుని గూర్చిన సంగతులను అతనితో ముచ్చటించలేక పోతిని. మౌన ధ్యాన సమయమునకు కూడ ఆ స్థలము అనుకూలముగా లేకుండెను. కనుక ప్రతిరోజు ఉదయము మౌన ధ్యాన సమయమునకై నేను ఒక పొలమునకు వెళ్ళుచుంటిని. ఒకరోజున నేను మౌనధ్యాన సమయము ముగించుకొనిన తరువాత పొలముయొక్క అవతలివైపు నుండి పాటలు వినబడుచుండెను. పాటలు వినిపించుచున్న వైపు నేను నడచి వెళ్ళితిని. అక్కడ ఒక గుడిసె వుండెను. అక్కడ

నిలువబడి ఆ పాట వింటిని. వారు కుటుంబముగా క్రైస్తవ పాటను పాడుచుండిరి. నేనక్కడ నిలువబడి యుండుట ఒకరు చూచి ఆ గుడిసెలో నుండి బయటకు వచ్చి "మీరు ఎవరికొరకైన వచ్చితిరా?" అని నన్ను అడిగిరి. అందుకు నేను "లేదు, నేను కూడ క్రైస్తవుడను. క్రైస్తవ పాట విని ఇక్కడకు వచ్చితి"నని అంటిని. అప్పుడతడు "లోపలికి రండి" అని నన్ను ఆహ్వానించగా ఆ గుడిసె లోపలికి నేను వెళ్ళితిని. అది ఒక చిన్న గుడిసె. అందులో కుర్చీలుగాని, సోఫాలుగాని అటువంటి వస్తు సామగ్రి ఏదియులేదు. నేను నేల మీద కూర్చుంటిని. అయినను నా హృదయము ఎంతో సంతోషముగా నుండెను. నా స్నేహితుడు ఎంతో ధనవంతుడు. అతని యిల్లు విలువైన వస్తు సామగ్రితో అలంకరించబడి, చూచుటకు ఎంతో అందముగా నుండెను. ఎంత మంచి ఇల్లయినను ఎంత అద్భుతముగా కన్పించినను, నేనైతే ఆ యింటిలో పరాయి వ్యక్తివలెనుంటిని. ఈ గుడిసెలోనివారు ఎంతో పేదవారు. అతనిని నేను మొదటిసారిగా చూచితిని. అతని పేరు కూడ తెలియదు ఎంతో పేదవాడు. నెలకు 10 రూపాయలు మాత్రమే అతని ఆదాయము అయినప్పటికిని నేనక్కడ ఎంతో సంతోషముగా నుంటిని. నేను అతనితో కలిసి ప్రార్థించగలిగితిని, కలిసి పాడగలిగితిని. నా హృదయము ఎంతో సంతోషించెను. "నా ప్రజలను నేను కనుగొంటి"నని సంతోషించితిని. మనము దేవునికి చెందినవారము, దేవుని ప్రజలకు చెందినవారము. లోక సంబంధులతో స్నేహము చేయువారు, లోకస్థుల ద్వారా ఆకర్షింపబడేవారు ఆత్మీయముగా ఎదుగలేరు.

యోసేపు తన ఇద్దరు కుమారులను యాకోబునొద్దకు తెచ్చినప్పుడు యాకోబు వారిమీద చేతులుంచెను. ఆ రీతిగా చేతులుంచుటద్వారా "మీరు ఐగుప్తులో పుట్టినను నా కుటుంబమునకు చెందినవారు. అబ్రాహామునకును, అతని సంతానమునకును యిచ్చిన ఆశీర్వాదములలో మీకును పాలు కలదు" అని భావమిచ్చునట్లుగా చేతులుంచెను. అట్లు చేతులుంచుటద్వారా "నా కుమారులారా, మీరు ఐగుప్తు ధనమునుచూచి మోసపోకుడి. అబ్రాహాము కుమారులతో పాటు మీకును దేవుడు శాశ్వతమైన ఆత్మీయమైన స్వాస్థ్యమును యిచ్చియున్నాడు" అని తెలియజేసెను. ఆ రీతిగా చేతులుంచుటద్వారా యేసుక్రీస్తు ప్రభువు తన ప్రశస్తమైన రక్తమిచ్చి కొన్నట్టి బిడ్డలతో మనకు గల ఆత్మీయసంబంధమును, ఏకత్వమును తెలియజేసెదము. నీవుండే స్థలములో చాలామంది యుండవచ్చును. అయితే యేసుప్రభువును ఎరిగినవారు మాత్రమే నీకు సహోదరులు, సహోదరీలుగా నుండెదరు. మత్తయి 12:50లో ప్రభువిట్లు చెప్పెను. "పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, సహోదరియు, నా తల్లియుననెను". చేతులుంచుటద్వారా మనము ప్రభువు బిడ్డలతో అనగా వారెవరైనను, ఏ జాతివారైనను, ఏ కులమువారైనను, ఏ స్థితిగలవారైనను, వారితో మనము ఏకమై యున్నామని వెల్లడిచేయుదుము. మనము ఒకే కుటుంబమునకు చెందినవారము, లోకముద్వారా, లోక ఆకర్షణలద్వారా మోసగింపబడకూడదు. కనుక మొట్టమొదటిగా హస్త నిక్షేపణ అను సిద్ధాంతము యితర విశ్వాసులతో మనకు కలిగిన ఆత్మీయ సంబంధమును చూపించుచున్నది.

రెండవదిగా, హస్త నిక్షేపణ యేసుక్రీస్తు ప్రభువుయొక్క మరణముతో ఐక్యపరచుకొను విషయమును చూపించుచున్నది. "అతడు దహనబలిగా అర్పించు పశువు తలమీద తన చెయ్యి ఉంచవలెను; అతని నిమిత్తము ప్రాయశ్చిత్తము కలుగునట్లు అది అతని పక్షముగా అంగీకరించబడును" (లేవీ. కాం. 1:4). ప్రత్యక్ష గుడారము దగ్గర ఏ బలి అర్పించవలసివచ్చినను అతడు దాని తలమీద తన చేతులుంచవలెను. తన పాపములన్నింటిని ఒప్పుకొనుచు చేతులుంచవలెను. తరువాత ఆ బలిపశువు వధింపబడి బలిపీఠముపై అర్పించబడును. ఆ పశువుమీద చేతులుంచుట వలన అతడు "నా స్థలములో ఈ పశువు మరణించుచున్నది" అను విషయమును బయలుపరచును. అతడు బలికాలేదు గాని అతని స్థానములో పశువు బలి అయ్యెను. అదే రీతిగా విశ్వాసము ద్వారా చేతులుంచుటవలన యేసు ప్రభువు నా స్థానములో మరణించియున్నాడని తెలియజేయు చున్నాము.

అపొ. కా. 8:14-17లలో పేతురు, యోహానులు సమరయలోని విశ్వాసులమీద చేతులుంచినట్లుగా చూచెదము. "సమరయ వారు దేవుని వాక్యము అంగీకరించిరని యెరూషలేములోని అపొస్తలులు విని పేతురును యోహానును వారియొద్దకు పంపిరి. వీరు వచ్చి వారు పరిశుద్ధాత్మను పొందవలెనని వారి కొరకు ప్రార్థన చేసిరి. అంతకుముందు వారిలో ఎవని మీదను ఆయన దిగియుండలేదు వారు ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము మాత్రము పొందియుండిరి. అప్పుడు పేతురును యోహానును వారిమీద చేతులుంచగా వారు పరిశుద్ధాత్మను పొందిరి". సాధారణముగా విశ్వసించిన వెంటనే పరిశుద్ధాత్మను పొందెదము. అయితే సమరయుల

విషయములో ఏ కారణము నిమిత్తమో పరిశుద్ధాత్మను వారు పొందలేదు. అపొస్తలులు వారిమీద చేతులుంచినప్పుడు వారు పరిశుద్ధాత్మను పొందిరి.

యోహాను 4:9లో యూదులు సమరయులతో సాంగత్యము చేయరని చదివెదము. ఇప్పుడు ఆ సమరయులు ప్రభువునందు విశ్వాసముంచిరి. వారు క్రొత్తగా జన్మించినప్పుడు పరిశుద్ధాత్మను పొందియున్నట్లయినచో, యూదులు వారిని నమ్మి యుండెడివారు కాదు. యూదులు పెంతెకొస్తు దినమున పొందిన పరిశుద్ధాత్మ వీరికి లేదని తలంచెడివారు. ఇప్పుడు ప్రభువు పేతురును, యోహానును పంపుటద్వారా తమంతట తామే తాము పెంతుకొస్తునాడు పొందిన పరిశుద్ధాత్మను సమరయులు కూడ పొందియున్నారని చూడగల్గిరి. పేతురు, యోహాను సమరయుల మీద చేతులుంచి, వారు కూడ వీరితో సమానులనియు, ఇప్పుడు వారు సహోదరులనియు వారిని అంగీకరించిరి. అంతకు మునుపు వారిలో ఈ ఐక్యత లేదు. ఆత్మీయ ఐక్యతను, ఏకత్వమును చూపించుటకు వారిమీద చేతులుంచిరి. మన మందరము ఒకటే అను సత్యమును తెలియ జేయుటయే హస్త నిక్షేపణ. ధనవంతులు, దరిద్రులని భేదము లేదు. గొప్ప, పేద భేదములేదు. అందరూ ఒక్కటే. "యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు. దాసుడని స్వతంత్రుడని లేదు... యేసుక్రీస్తునందు మీరందరు ఏకముగా ఉన్నారు" (గలతీ 3:28). మనము ఏ కుటుంబము నుండి వచ్చినవారమైనను, ఏ దేశమునకు చెందినవారమైనను, ఎట్టి జీవితము జీవించినవారమైనను, తిరిగి జన్మించిన వెంటనే మనమందరము దేవునికి సమానముగా ప్రశస్తమైనవారము. సమానముగా అవసరమైన వారము, సమానముగా ముఖ్యమైనవారము. హస్త నిక్షేపణ ద్వారానే దీనిని తెలియజేయుదుము.

కొరింథీ సంఘస్తులు అనేక గుంపులుగా విభాగింపబడిరి. "మీలో ఒకడు నేను పౌలువాడను, ఒకడు నేను అపొల్లోవాడను, మరియొకడు నేను కేఫావాడను, ఇంకొకడు నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచున్నారు... క్రీస్తు విభజింపబడియున్నాడా? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?" (1 కొరింథీ, 1:12, 13). ఈ రీతిగా వారు అనేక పేర్లతో తమ్మును తాము పిలుచుకొనుచుండిరి. బాప్టిస్టు, మెథడిస్టు, ఆంగ్లికన్ బ్రదరన్, పెంతెకొస్తు అను పలు రకముల పేర్లతో పిలువబడుచున్నారు. మనమందరము క్రీస్తుకే చెందినవారము. వేరే పేర్ల ద్వారా మనమెవ్వరము పిలువబడకూడదు.

పెండ్లిచేయుటకు లైసెన్సు కొరకై నేను దరఖాస్తు పెట్టినప్పుడు "మీరు ఏ డినామినేషన్‌కు చెందినవారు?" అని అడిగిరి. అందుకు నేను "క్రీస్తు శరీరమునకు చెందినవాడనని జవాబిచ్చితిని". తరువాత ప్రశ్న "మీకు సభ్యులెందరు" ఈ ప్రశ్నకు నేనిట్లు జవాబిచ్చితిని. "మాలో సభ్యత్వములేదు. మేమందరము సమానము. తిరిగి జన్మించినవారందరు ఒక్కటే. వారినందరిని ఆహ్వానించెదము" అని చెప్పితిని. ఇట్టి ఏకత్వమును కాపాడుకొనవలయును. చేతులుంచుట ద్వారా మనమందరము దేవుని దృష్టిలో ఒక్కటేననియు, అందరము సమానమనియు సాక్ష్యమిచ్చు చున్నాము. మనకేదైన విద్యగాని, ఆస్తిగాని యున్నట్లయితే అది కేవలము దేవుని కృపయే. "అయినను నేను ఏమైయున్నానో అది దేవుని కృపవలననై యున్నాను. మరియు నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు. కాని వారందరి కంటే నేనెక్కువగా ప్రయాసపడితిని. ప్రయాసపడినది నేను కాను, నాకు తోడైయున్న దేవునికృపయే" (1 కొరింథీ. 15:10). పౌలు

తక్కిన అపొస్తలులల కంటె ఎక్కువగా ప్రయాసపడెను. అది దేవుని కృపద్వారానే. దేవుడు మనలో ఎవరికైనను ఏదైన వరమిచ్చినట్లయినచో అది కేవలము దేవుని కృపయే. దానిని పొందుటకు యోగ్యులము కాము. మనము కృపద్వారానే రక్షింపబడితిమి. వరములను కూడ కృపద్వారానే పొందితిమి. మనము పరలోకమునకు వెళ్ళినప్పుడు మన నమ్మకత్వమును బట్టి బహుమానములు దొరుకును. కాని మనకివ్వబడిన వరములను బట్టికాదు.

ప్రారంభ దినములలో శత్రువు యూదులు, అన్యజనుల మధ్య భేదములు కలుగజేసెను. గలతీ 2:11-14లలో అట్టి భేదము విషయమై దేవుడు పౌలుద్వారా పేతురును గద్దించెను. ఇండియా దేశములో విశ్వాసుల మధ్య కూడ గొప్ప కులము, నీచ కులము అను బేధములను చూచు చున్నాము. అదేరీతిగా నామకార్థ క్రైస్తవుల మధ్యలో నిర్ధారణ పొందితేనే తప్ప పరిశుద్ధ సమభాక్త్యములో పాలుపొంద కూడదని చెప్పెదరు. తప్పుడు బోధల వలన అటువంటి బేధములు ఏర్పడుచున్నవి. రక్షింపబడిన వారందరు ఒక్కటే. ఒక్కటిగానే యుండవలయును. విశ్వాసులముగా దేవుని ప్రజలమధ్య విభజన తీసికొని వచ్చునటువంటి ఏ కార్యక్రమములో నైనను, ఏ వేడుకలోనైనను పాలు పొందకూడదు.

అపొస్తలుల కార్యములు 13:2, 3లలో చేతులుంచుటను గూర్చిన మరియొక సందర్భమును చూచెదము. "వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ నేను బర్నబాను, సౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను. అంతట వారు ఉపవాసముండి ప్రార్థన చేసి వారిమీద చేతులుంచి వారిని

పంపిరి''. బర్నబా, పౌలు సంఘముద్వారా పంపబడిరి. వారంతట వారే వెళ్ళలేదు. వారిమీద చేతులుంచుటద్వారా పెద్దలు యిట్లు వెల్లడి చేయుచున్నారు. 'మా పక్షముగా మీరు వెళ్లుచున్నారు. మేము కూడ మీతో వచ్చుచున్నాము. ప్రార్థనా సహవాసములో మీతో నిలిచియుందుము' హస్తనిక్షేపణ అనునది ఒక ఆచారము కాదు. చేతులలో ఏమి లేదు. మనము ఇతరులతో చేయి కలిపినప్పుడు మంచి స్నేహితులమని తెలియచేయుటకు చేతులు కలిపెదము. సర్వ ప్రపంచములో చెదరియున్న సార్వత్రిక సంఘము పక్షముగా, మనమందరము ఒక్క కుటుంబమనియు, యేసుక్రీస్తు ప్రభువుయొక్క సంఘమనియు తెలుపునటువంటి మన ఆత్మీయ సమానత్వమును, ఐక్యతను హస్తనిక్షేపణ ద్వారా తెలియజేయు చున్నాము. ప్రశస్త రక్తము ద్వారా మనము కొనబడిన వారము గనుకనే మనమందరము సమానముగా ప్రశస్తమైనవారము.

1 కొరింథీ. 12:18-21లలో క్రీస్తు శరీరము యొక్క మర్మమును గూర్చి చదివెదము. మానవశరీరములో ప్రతి అవయవము, చిన్న గ్రంథి కూడ అవసరము. తల కాలుతో నీవు, నాకు అవసరములేదని చెప్పజాలదు, దేవుడు మనలను అట్లుచేసియున్నాడు. అదే రీతిగా పరలోక కుటుంబము లోని ప్రతి వ్యక్తి దేవునికి అవసరము. ప్రతి వ్యక్తి ఉపయోగకరము. కనుకనే హస్త నిక్షేపణ కూడ ఒక వాడుక కాదు గాని అది ఒక సాక్ష్యము. బాప్తిస్మము, హస్త నిక్షేపణ ఒక్కటిగా నున్నవి. దేవుని క్రమమును పాటించవలయుననినచో, ప్రభువుకు లోబడి బాప్తిస్మము తీసికొనిన వారిమీద చేతులుంచి ప్రార్థించవలయును. ఈ దినములలో అనేకచోట్ల ఆత్మీయ అంధకారము అలుముకొనినందున అనేకులు సత్యమును ఎరుగకున్నారు.

* * *

# 5. మృతుల పునరుత్థానము

రక్షణలోని 5వ మూల సిద్ధాంతము మృతుల పునరుత్థానము. ఒక దినమున మనము మృతులలో నుండి తిరిగి లేచెదమని నమ్మవలయును (1కొరింథీ. 15:50-57). ఎవరైతే ఈ సత్యమునందు విశ్వాసముంచరో వారు అజాగ్రత్తగా జీవించెదరు. యేసు ప్రభువు ఏ రీతిగా తిరిగి లేచెనో, అదేరీతిగా తిరిగిరానై యున్నాడనియు, ఆయన నా కొరకై వచ్చుచున్నాడనియు, ఆయనను చూచినప్పుడు ఆయనవలె నేను కూడ మార్చబడుదుననియు నమ్మవలెను. మృతుల పునరుత్థానమునందు విశ్వాసముంచనివారు లోకరీతిగా జీవించెదరు. యేసుక్రీస్తు ప్రభువు రాకడ కొరకై సిద్ధముగా నుండవలయుననెడి కోరికను వారు కలిగియుండరు. ఆ దినము కొరకై సిద్ధపడుటకే ప్రతి ఆదివారము బల్లలో పాలు పొందెదము. "మీరు ఈ రొట్టెను తిని, ఈ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించుదురు" (1 కొరింథీ 11:26). ఈ రీతిగా యేసుక్రీస్తు ప్రభువు మనలను తీసికొని వెళ్ళుటకై తిరిగి వచ్చుచున్నాడనియు, మనకు అమర్త్య దేహములను ఆయన యిచ్చుననియు వెల్లడి చేసెదము. మృతుల పునరుత్థానమునందు విశ్వాసముంచుటద్వారా లోకము యొక్క మోసములన్నిటి నుండి రక్షింపబడెదము.

* * *

# ౬. నిత్యమైన తీర్పు

రక్షణలోని చివరి సిద్ధాంతము నిత్యమైన తీర్పు. ఈ లోకములో మనము జీవించిన జీవితమును గూర్చి దేవుని దగ్గర లెక్క చెప్పుటకు ఆయన యెదుట నిలువబడవలెను. "మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క ఒప్పగించవలెను" (రోమా 14:12). అనగా మన మాటలను గూర్చియు, క్రియలను గూర్చియు లెక్క చెప్పవలయును. "నేను మీతో చెప్పునదేమనగా మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటనుగూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు" (మత్తయి 12:36-37). నిత్యమైన తీర్పునందు విశ్వాసముంచినట్లయినచో మన మాటలలో ఎంతో జాగ్రత్తగా నుందుము. మనమాట అవునంటే అవును కాదంటే కాదు. అంతే ఉండవల యును. అనేకసార్లు మనము కూడ అర్థములేని మాటలు ఊరకయే చెప్పెదము. నిత్యమైన తీర్పు నందు విశ్వాసముంచు వారు వారి డబ్బును కాని, సమయమును కాని, శక్తినికాని వ్యర్థముగా ఖర్చు పెట్టరు. మన జీవితములో మెలకువ కలిగి జీవించుటకు జాగ్రత్త పడవలెను.

ఈ ఆరు మూల సిద్ధాంతములు కలిసియుండును. మనము వాటిని వేరు చేయలేము. నిర్జీవ క్రియల విషయమై నీవు పశ్చాత్తాపపడి దేవునియెడల విశ్వాసము కలిగి, బాప్తిస్మములో సాక్ష్యమిచ్చి; హస్తనిక్షేపణ పొంది; మృతుల పునరుత్థానమునందు, నిత్యమైన తీర్పునందు విశ్వాసముంచినట్లయినచో నీవు బలమైన పునాదిమీద కట్టబడినవాడవై ఆత్మీయముగా ఎదుగుదువు.

* * *